క్లుప్తంగా

నగరపాలక సంస్థ మేనేజర్‌గా షకీల్ అహ్మద్



కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ మేనేజర్‌గా షకీల్ అహ్మద్ బాధ్యతలు చేపట్టారు. గత సర్వసభ్య సమావేశం లో ఆయనకు ప్రమోషన్ ఇస్తూ సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. ఇదివరకు మేనేజర్‌గా ఉన్న వెంకట్రామిరెడ్డి జమ్మలమడుగు కమిషనర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో షకీల్ అహ్మద్ మేనేజర్‌గా నియమితులయ్యారు. 1993లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన షకీల్ సీనియర్ అసిస్టెంట్‌గా, సూపరింటెండెంట్‌గా పదోన్నతులు పొందారు.

టౌన్‌ప్లానింగ్ విభాగంలో బదిలీలు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న డిప్యూటీ సిటీ ప్లానర్ సూరజ్ కుమార్ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. అలాగే అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఉన్న నాగరాజును ప్రొద్దుటూరుకు బదిలీ చేసి, అక్కడ ఏసీపీగా ఉన్న మునిరత్నంను కడప కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. బద్వేల్‌లో టీపీఓగా పనిచేస్తున్న రత్నరాజును కడపకు బదిలీ చేశారు.

మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



డాక్టర్ సాయిచరితను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తదితరులు

వైవీయూ: మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యురాలు డాక్టర్ సాయిచరిత సూచించారు. కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. సాయిచరిత మాట్లాడుతూ మహిళలకు రుతుస్రావంలో కలిగే సమస్యలు, పీసీఓడీ వలన కలిగే సమస్యలపై అవగాహన కల్పించారు. క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా ఆధ్వర్యంలో అధ్యాపకులు డాక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డా. వంశీవిహారి, డా. ప్రకాష్ నారాయణరెడ్డి, ఎం.నాగరత్న, ఎం. గురుమోహన్ రెడ్డి, ఆశలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్క నాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని ఏపీజీబీ చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్ తెలిపారు. సోమవారం కడప నగరంలోని మహవీర్ మ్యూజియంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా క్లీనింగ్, ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇష్టానుసారంగా చెట్లను నరకడం ద్వారా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా వర్షాలు లేకపోవడంతో పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యతలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు జీఎంలు సంజీవప్ప ఆర్‌బీ, హరకేశ్వరప్రసాద్, ఆర్‌ఎం శ్రీనివాసప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

29న సాహితీ సదస్సు

కడప కల్చరల్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 29న సాహితీ సదస్సు నిర్వహించనున్నట్లు బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. నెలనెల సీమ సాహిత్యం 136వ సదస్సులో భాగంగా ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఇందులో జోస్యం జనార్ధనశాస్త్రి జీవితం–సాహిత్యం అనే అంశంపై విశ్రాంత తెలుగు పండితులు విద్వాన్ కందిమళ్ల రాజారెడ్డి ప్రసంగిస్తారన్నారు.

రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు



విద్యార్థికి రక్త గ్రూపు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కడప కల్చరల్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కడప నగరం గాంధీనగర్ హైస్కూల్లో విద్యార్థులకు సోమవారం రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధానోపాధ్యాయురాలు పుష్పకుమారి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు రక్తదాన ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ సుధాకర్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ స్వరూప రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాయడం తగదు



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జాతీయ కార్మిక, రైతు సంఘాలు సోమవారం కలెక్టరేట్ ఎదుట బ్లాక్ డే నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్‌లు మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలన్నారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు అప్పగించి ఆదాని, అంబానీలకు కొమ్ము కాస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ మానుకోవాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కడప ఉక్కు ఫ్యాక్టరీని తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతులకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం తీసుకు రావాలని కోరారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు ఎంవీ సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, యానాదయ్య, దస్తగిరిరెడ్డి, కార్మిక సంఘాల నాయకులు మద్దిలేటి, చంద్రారెడ్డి, చాన్‌బాష తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా

– పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ నినాదాలు



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, ఆయాలు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలలో పనిచేస్తున్న ఆయాలకు, వాచ్‌మెన్‌లకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా, ఉపాధ్యక్షులు చాంద్ బాషా, కార్యదర్శి మద్దిలేటిలు అన్నారు. తక్షణం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం కడప డీఈఓ కార్యాలయం ఎదట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలల తరబడి జీతాలు అందక చిరుద్యోగుల కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. దీంతోపాటు పిల్లల చదువులకు, ఆసుపత్రుల ఖర్చులు వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. వీరు నెలంతా పనిచేస్తే వచ్చేది రూ.6 వేలు మాత్రమేనన్నారు. అది కూడా సక్రమంగా ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి తక్షణం వేతనాలను విడుదల చేయాలన్నారు. ధర్నా అనంతరం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తారక రామారావు, ప్రభుత్వ పాఠశాలల ఆయా యూనియన్ నాయకురాళ్లు మంజుల, నాగలక్ష్మి, షకీరా, కుమారి, భారతి, వెంకటమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు ఇవ్వాల్సిన మెస్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీపీ నాగేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరంలోని ప్రభుత్వ వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ గురుకుల వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు గత ఎనిమిది నెలలుగా మెస్ ఛార్జీలు అందలేదన్నారు. దీంతోపాటు నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెరిగి పోవడంతో నిర్వహణ భారంగా మారిందన్నారు. దీంతో వార్డెన్‌లు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై స్పందించి మెస్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న సీఐటీయూ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: అన్ని దానాల కెల్లా అన్నదానం చాలా గొప్పదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. బార్మీ సందర్భంగా సోమవారం నగరంలోని పాత బస్టాండ్ ఆవరణంలో సీఐటీయూ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ సీఐటీయూ హమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మస్తానవల్లి నాయకత్వంలో హమాలీ కార్మికులు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాజా, షబ్బీర్, సోనీ ,మౌలాలి , ఖాదరు, షేక్షావల్లి, గౌస్ పీర్, అల్లా బకాష్ అబ్దుల్లా, దస్తగిరి రెడ్డి, శ్రీరామ్ రాము, శ్రీనివాసులు , రామ్మూర్తి , మనీ తదితరులు పాల్గొన్నారు.

పద్మాలయ వృద్ధాశ్రయంలో...

కడప ఎడ్యుకేషన్: అన్నదానం ఎంతో మిన్న అని సంగం డెంటల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ నజముద్దీన్ అన్నారు. సోమవారం కడప ఇంద్రానగర్ పద్మాలయ వృద్ధాశ్రయంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు ఖాదర్‌బాషా, మాజీ కార్పొరేటర్ జాకీరుద్దీన్, ఇమ్రాన్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదు

కడప కార్పొరేషన్: డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ హిందువులను రెచ్చగొట్టి రాష్ట్రంలో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నం చేయడం సరికాదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ వై. రమేష్ బాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తిరుమల లడ్డుల నాణ్యత విషయంలో నిజంగా అందులో ఏవైనా అవకతవకలు జరిగి ఉంటే విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర మతాలను ప్రస్తావించడం తగదన్నారు.

పంట కోత ప్రయోగాల పరిశీలన

సింహాద్రిపురం : మండలంలోని కడపనాగాయపల్లె, లోమడ గ్రామాలలో నిర్వహిస్తున్న పంట కోత ప్రయోగాలను మండల వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి సోమవారం పరిశీలించి వీహెచ్‌ఏలకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడక దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని, సోయాబీన్ పంట ఎకరాకు మూడు క్వింటాల లోపే దిగుబడి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలపై అవగాహనతోనే నష్ట నివారణ

– వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి



హాజరైన విద్యార్థులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ: సాంకేతిక యుగంలో సామాజిక మాధ్యమాల వినియోగం పట్ల అవగాహనతోనే విలువల పరంగా, ఆర్థికంగా నష్టపోకుండా ఉండగలుగుతామని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలోని అన్నమాచార్య సెనెట్ హాల్లో ×సైబర్ సెక్యూరిటీ×పై అవగాహన కార్యక్రమం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ సాంకేతికత పెరిగే కొద్దీ సైబర్ క్రైమ్ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మాధ్యమాలను వినియోగించే క్రమంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులతో పరిచయాలు, యాప్‌లను క్లిక్ చేయకూడదన్నారు. సైబర్ సెక్యూరిటీ నిపుణులు పి. మాధవరెడ్డి కీలక ఉపన్యాసం చేస్తూ ఉన్నత చదువులు చదివిన వారే సైబర్ వలలో చిక్కుకుంటున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో రోజుకు రూ.10 కోట్ల మేర సైబర్ నేరాల ద్వారా ప్రజలు నష్టపోతున్నారన్నారు. డిజిటల్ ఫ్రాడ్స్ శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ వెల్లడించిందన్నారు. కొత్త వ్యక్తులతో ఆన్‌లైన్ స్నేహం మంచిది కాదని, మీ అమాయకత్వమే వారికి పెట్టుబడిగా మారుతుందన్నారు. యాప్‌ల ద్వారా ప్రైవేటు రుణాలు తీసుకోవడం అత్యంత ప్రమాదకరమన్నారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల సందేహాల నివృత్తి చేశారు. డీన్ ఆచార్య ఏజీ దాము మాట్లాడారు. కార్యక్రమం అనంతరం మాధవరెడ్డిని సత్కరించారు. ఈ సమావేశంలో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ సునీత, డా.కోట మృత్యుంజయరావు, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

కడప నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



అధికారులతో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ వైపీ నందన్

కడప కార్పొరేషన్: కడప నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ అన్నారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా చిన్న చౌక్, కోటిరెడ్డి సర్కిల్, నాగరాజు పేట, ఎస్పీ బంగ్లా రోడ్, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. చిన్నచౌక్ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను పరిశీలించి, వెంటనే చెత్త తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కడప నగరంలో పరిశుభ్రతను కాపాడటానికి , రోగాల నివారణ కు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పాదచారుల మార్గంలో ఉన్న పండ్ల బండ్లను, ఇతర వస్తువులను అక్కడి నుండి తొలగించి, పాదచారులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని సూచించారు. ఆక్రమణలను తొలగించే క్రమంలో వ్యాపారులతో మాట్లాడి, నగర శుభ్రతను కాపాడేందుకు క్రమశిక్షణ పాటించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. హరిత హోటల్ సమీపంలో డ్రెయినేజ్ సమస్యను పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిపోయి ఉండటం చూసి వెంటనే నీటిని తొలగటించాలని సూచించారు. కోటిరెడ్డి సర్కిల్ వద్ద నుండి ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద వరకు నీరు ఎక్కడ కూడా నిలువ ఉండకుండా తగిన చర్యలు తక్షణమే తీసుకోవాల్సిందిగా ఇంజనీరింగ్ విభాగ అధికారులు, శానిటేషన్ విభాగ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



జేసీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలనే రాష్ట్ర పిలుపులో భాగంగా ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, వీరపోగు రవి ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం ఒక్క విద్యారంగ సమస్యను కూడా పరిష్కరించలేదని దుయ్యబట్టారు. డిగ్రీ కళాశాలల్లో మేజర్, మైనర్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పులివెందుల మెడికల్ కళాశాలకు అండర్ టేకింగ్ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. యూనియన్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, అభినయ్, నాగేంద్ర, పండు పాల్గొన్నారు.

యురేనియం వ్యర్థాల నిర్వహణలో అలసత్వం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్:యురేనియం శుద్ధి వ్యర్థాల నిర్వహణలో లోపాలను అధికారులు పట్టించుకోకుండా ప్రజల ప్రాణాలను గాలికి వదిలేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర విమర్శించారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో వేముల మండలంలో తుమ్మలపల్లి వద్ద నిర్మించిన యురేనియం ఫ్యాక్టరీ నుంచి యురేనియం శుద్ధి చేసిన తర్వాత విడుదలయ్యే వ్యర్థాలను భూమిలో కలవకుండా చూడాల్సిన బాధ్యత సంస్థ అధికారులపై ఉందన్నారు. టైలింగ్ పాండ్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల యురేనియం వ్యర్థాలు భూమిలో ఇంకి ఆ ప్రాంతంలోని నీటిలో కలవడం ద్వారా మబ్బుచింతలపల్లె, తుమ్మలపల్లె, కేకే కొట్టాల, భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయన్నారు. తద్వారా తాగు, సాగునీటిలో యురేనియం అవశేషాలు కలిసి ప్రజలను పశువులను అంతు చిక్కని రోగాల బారిన పడేస్తున్నాయన్నారు. అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపకపోతే పోరాటం చేయాల్సి వస్తుందన్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలో ఓ వ్యక్తిపై చేసిన దాడి కేసులో నిందితులను అరెస్ట్ చేశామని కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్. రమాకాంత్ తెలిపారు. సోమవారం కడప తాలూకా పోలీస్‌స్టేషన్ ఆవరణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిల్టప్ సర్కిల్‌లో వారం రోజుల క్రితం షేక్ మహబూబ్ బాషా అనే వ్యక్తిని బార్‌లో దాడి చేసిన కేసుకు సంబంధించి నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. తాలూకా సీఐ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన నిందితుల వివరాలను తెలియజేశారు. కడపకు చెందిన మహబూబ్ బాషా బిల్టప్ సమీపంలోని ఓ బార్‌లో కూర్చుని ఒంటరిగా మద్యం సేవిస్తున్నాడు. కడప రామరాజు నగర్ లోహియానగర్‌కు చెందిన గూడూరు రాజగోపాల్ స్నేహితులతో కలిసి అదే బార్‌కు వచ్చాడు. మహబూబ్‌బాషాను పక్కకు వెళ్లాలంటూ దాడి చేశారు. దీనితో వారి దెబ్బలు తట్టుకోలేక మహబూబ్‌బాషా పరుగెడుతుంటే రాజగోపాల్ అతని స్నేహితులు కలిసి అతన్ని వెంబడించి నడిరోడ్డుపై కాళ్లు, చేతులతో కొట్టడంతో పాటు చాకుతో దాడి చేసి గాయపరిచారు. ఈ కేసు సంబంధించి నిందితులైన గూడురు రాజగోపాల్, రామరాజుపల్లికి చెందిన షేక్ మహబూబ్‌బాషా, లోహియానగర్‌కు చెందిన షేక్ నూరుల్లా, మరియాపురానికి చెందిన శీలం బాలస్వామి అలియాస్ బాలు, కడప రవీంద్ర నగర్‌కు చెందిన షేక్ జిలానీ బాషాలను అరెస్ట్ చేశారు. వీరిలో బాలస్వామిపై కడప తాలూకా పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉందన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

అట్లూరు : అట్లూరు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థినులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల స్పెషలాఫీసర్ ఫణిశ్రీ, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీల తెలిపారు. ఈ నెల 22న నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అండర్–19 టెన్నిస్ బాల్, క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరచారని వారు పేర్కొన్నారు. రిషిత, మస్తాన్‌బీ, శ్రీలక్ష్మీప్రసన్న, సుప్రియ, ఝాన్సీలక్ష్మి కడప జిల్లా జట్టు తరపున జాతీయ స్థాయికి ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. అలాగే రిషిత అనే విద్యార్థిని బెస్ట్‌ప్లేయర్‌గా రాణించడంతో సన్మానించినట్లు తెలిపారు.

సత్యదేవుని ఆలయంలో దసరా

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో శ్రీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. అక్టోబరు 3 నుంచి 12వ తేది వరకు రోజుకొక అలంకారంతో పూజాధికాలు నిర్వహించనున్నారు. ఆలయ అర్చకులు విజయ్‌భట్టర్ ఒక ప్రకటనలో ఈ వివరాలు తెలిపారు.

సర్వేయర్ల బదిలీ

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో 20 మంది మండల సర్వేయర్లను వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే బదిలీ స్థానాలలో విధులలో చేరాలని ఆదేశించింది.

2న పితృ తర్పణాలు

కడప కల్చరల్ : సమైక్య బ్రాహ్మణ సమాఖ్య సంస్థ , అర్చక పురోహితుల సంఘం, జిల్లా బ్రాహ్మణ సంఘంతో కలిసి అక్టోబరు 2న మహాలయ పక్ష అమావాస్య సందర్భంగా పెద్దలకు తిలా తర్పణం చేయనున్నామని సంస్థ ప్రతినిధులు పిడతల గోపాలకృష్ణశర్మ తెలిపారు. సోమవారం నగరంలోని సంస్థ కార్యాలయంలో సంస్థల ప్రతినిధులతో కలిసి ఆయన విలేకరులకు ఈ విషయాలు తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, హాజరు కాదలచుకున్న వారు పంచె, టవలు, చెంబు, గ్లాసు, ఉద్ధరిణి, అర్ఘ్యపాత్ర తదితర సామాగ్రిని వెంట తెచ్చుకోవాలని సూచించారు. కడప నగర సమీపంలోని చిన్నచౌకు బైపాస్‌రోడ్డులోగల గాయత్రి సదన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు డాక్టర్ గోపినాథ్, జీవీ శివరావు, శశిస్వామి, పీవీఎస్‌వీ ప్రసాద్‌రావు, పీఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు



పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, కడప మండల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం కడప నగరంలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో కడప ఎంఈఓ దిద్దకుంట గంగిరెడ్డి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు ఎస్ఏ రైటింగ్, క్విజ్, డిబేట్, పెయింటింగ్, పోస్టర్ పెయింటింగ్ వంటి విభాగాలలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల నుంచి వచ్చిన విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. అనంతరం ఎంఈఓ గంగిరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని తీసుకొని విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనేక రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా పాఠశాల పరిశుభ్రత, మొక్కలు పెంపకం, ప్రకృతిని కాపాడడం, పర్యవేక్షించడం వంటి వాటిపై అవగాహన పెంపొందించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేడెట్స్‌కు అభినందన



ఉత్తీర్ణత సాధించిన కేడెట్స్‌తో ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ అధికారులు

వైవీయూ : 30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో నిర్వహించిన ఎన్‌సీసీ 'బి' సర్టిఫికెట్ ఫలితాల్లో కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) కేడెట్స్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బి సర్టిఫికెట్ పరీక్షకు కళాశాల నుంచి 41 మంది కేడెట్స్ పరీక్షకు హాజరుకాగా వీరిలో 24 మంది ఏ గ్రేడ్‌లోను, 17 మంది బి గ్రేడ్‌లో ఉత్తీర్ణులైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన ఎన్‌సీసీ కేడెట్స్‌ను, ఎన్‌సీసీ అధికారులను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్. నీలయ్య, డా. మహేష్ పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్ సందర్శన

వైవీయూ: కర్నూల్ కె.వి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం యోగివేమన విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెను సందర్శించారు. అంతరించిపోతున్న జీవజాతులను, అరుదైన మొక్కలను బొటానికల్ గార్డెన్‌లో సంరక్షించే విధానం ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రపంచంలోనే అతిపెద్ద పత్రమైన విక్టోరియా అమేజానికా చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వృక్షశాస్త్ర విద్యార్థులు తెలుసుకోతగినంత వృక్ష సంపద వైవీయూలో లభిస్తుందని తెలిపారు. విద్యార్థుల ఆసక్తిని గమనించి అభినందించారు. వారికి ఎర్రచందనం మొక్కలను పంపిణీ చేశారు. బొటానికల్ గార్డెన్ డైరెక్టర్ ఆచార్య ఎ. మధుసూదన్ రెడ్డి విద్యార్థులకు బొటానికల్ గార్డెన్ గురించి, అంతరించిపోతున్న జాతుల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థుల వెంట కర్నూలు ప్రభుత్వ కె.వి.ఆర్ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు డా. సునీత డా. డేవిడ్ ఉన్నారు.